సాక్షి ఒడిశా

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 6,19,085

బంగారం : 9 గ్రాముల 50 మిల్లీ గ్రాములు

వెండి : 2 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



వన్‌డే మ్యాచ్‌కు సిద్ధం

9న కటక్‌లో వన్‌డే మ్యాచ్ జరగనుంది. ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో



ఒత్తిడి నివారణే ధ్యేయం

లోకో పైలట్లకు శిక్షణ ఇచ్చారు. యోగాసనాలు నేర్పించారు.

- 8లో

న్యూస్‌రీల్

ఎక్సైజ్ దాడుల్లో 8 మంది అరెస్టు



దాడుల్లో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబోదల పోలీస్ స్టేషన్ పరిధిలోని జునాబలి, గొయిబయిలి, అమ్లాభట్ట తదితర ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం విస్తృతంగా దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో 725 లీటర్ల ఊటతో పాటు సారా తయారీకి సంబంధించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కొద్ది నెలలుగా ఈ ప్రాంతాల్లో నాటు సారా అక్రమ తయారీ, రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు ఈ మేరకు దాడులు నిర్వహించారు.

2,140 కిలోల గంజాయి ధ్వంసం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలను పరిశీలిస్తున్న ఎస్పీ స్వాతి ఎస్ కుమార్

రాయగడ: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు ఇటీవల కాలంలో దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్న 2140.135 కిలోల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ గురువారం ధ్వంసం చేసింది. ఎస్పీ స్వాతి ఎస్ కుమార్ ఆధ్వర్యంలో కాసీపూర్ సమితి టికిరిలోని ఉత్కళ అల్యూమిన కర్మాగారంలోని ఖాళీ స్థలంలో ప్రత్యేక బందోబస్తు మధ్య కాల్చివేశారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణ, సాగుపై పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపి వాటిని అంతమొందించేందుకు తీసుకుంటున్న చర్యల్లో వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు, దాడులను నిర్వహిస్తుంది. ఈ క్రమంలో స్వాధీనం చేసుకున్న గంజాయిని కాల్చివేశారు.


24 కేజీల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు 24 కేజీల గంజాయిని గురువారం రాత్రి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కుడుములగుమ్మ పంచాయతీ నందినిగూడ గ్రామ రహదారి వద్ద గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేపట్టారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అతివేగంగా వెళ్తుండడంతో పోలీసులు అనుమానంతో వారిని ఆపారు. అనంతరం వారి వద్దనున్న బస్తాను తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. వెంటనే వారిని అరెస్టు చేశారు. గంజాయి విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని బలిమెల ఐఐసీ దీరాజ్ పట్నాయిక్ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి



వై.ఆర్.రావు మృతదేహం,రావు (ఫైల్)

రాయగడ: స్థానిక మెయిన్‌రోడ్డు వద్ద నివసిస్తున్న డాక్టర్ రుక్మాంగధరరావు(74) (వై ఆర్ రావు) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. రుక్మాంగధరరావు మెయిన్ రోడ్డు సమీపంలో జరిగిన విందు భోజనానికి స్కూటీపై వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో స్థానిక కాపువీధిలో ఉన్న బ్రిగేడ్ పాఠశాల మలుపు వద్ద స్కూటీ అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టారు. దీంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగానే ప్రాణాలు విడిచారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ప్రముఖులు, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక తదితరులు రుక్మాంగధరరావు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మూడు దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రావుకు భార్య, ఒక కూతురు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై.. కొండంత ఆశ

- కొత్త నిధులు వస్తాయని ఆకాంక్ష
- కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి



భువనేశ్వర్: కొత్త ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ సాధారణ బడ్జెట్ శనివారం రానుంది. ఈ ఏడాది బడ్జెట్‌పై రాష్ట్రం కొండంత ఆశ పెట్టుకుంది. రాష్ట్రంలో తొలి సారిగా డబుల్ ఇంజిన్ సర్కారు పగ్గాలు చేపట్టింది. మరో వైపు ఇటీవల పారిశ్రామిక మహా కుంభ సదస్సు అత్యంత ఆడంబరంగా ముగిసింది. ఈసారి బడ్జెట్‌లో రాష్ట్రానికి పుష్కలంగా నిధులు కేటాయించేందుకు సానుకూల పరిస్థితులు నెలకొని ఉన్నాయని నిపుణులు, విశ్లేషకుల వర్గం కొత్త ఆశల్ని ప్రేరేపించింది.

ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్ ప్రభావంతో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులపై చర్చ పుంజుకుంది. దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు రాష్ట్రం కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరితో సతమతమైంది. ప్రస్తుతం రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో కొనసాగుతోంది. ఇప్పుడు రాష్ట్రానికి వివిధ రంగాల్లో పుష్కలంగా నిధులు వస్తాయని భావిస్తున్నారు.

ఫిబ్రవరి 1న కేంద్ర సాధారణ బడ్జెట్ రానుంది. దీనిపై రాజకీయ, పారిశ్రామిక, ఆర్థికవేత్తల శిబిరాల్లో చర్చలు మొదలయ్యాయి. ప్రధానంగా రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ప్రాధాన్యతపై అందరి దృష్టి కేంద్రీకృతం అవుతుంది.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన స్వల్ప వ్యవధిలో అనేక ప్రముఖ సదస్సులు, సమ్మేళనాలు విజయవంతంగా నిర్వహించారు. వీటిలో తాజాగా ముగిసిన ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్ పారిశ్రామిక విప్లవానికి శంఖారావంగా ఢంకా బజాయించారు. భారీ పెట్టుబడులతో ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి కేంద్రం మంజూరులు ఎంత వరకు లభిస్తాయనే అంశంపై లోతుగా చర్చలు జరుగుతున్నాయి.

రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు ఎన్నో ఆశలు, భయాందోళనలతో తల్లడిల్లుతున్నారు. సూక్ష్మ, లఘు, మధ్య స్థాయి వ్యాపారం (ఎంఎస్ఎంఈ), రసాయనాలు వంటి పరిశ్రమలకు పుష్కలంగా అవకాశాలున్నందున బడ్జెట్‌లో కొత్త నిధులు వెచ్చించాలని సూచించారు. గత ఏడాది వరకు రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలతో కేంద్రం ఒడిశాను టార్గెట్ చేసిందనే ఆరోపణ వ్యాప్తిలో ఉంది. ఈ ఏడాది అలా జరగకుండా ప్రస్తుత ప్రభుత్వం జాగ్రత్త వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మోహన్ చరణ్ మాఝి సర్కారుకు ఆర్థికవేత్తలు, నిపుణుల వర్గం ముందస్తు హితవు తెలిపింది.

ఒడిశా దీర్ఘకాలంగా కేంద్రం నిర్లక్ష్యానికి గురైంది. రాజకీయ కారణాలతో రాష్ట్రానికి హక్కు లభించడం లేదు. ఒడిశాలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ పెట్టుబడిదారులు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఇష్టపడడం లేదు. ఇప్పుడు డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చింది కాబట్టి.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదరణతో పుష్కలమైన నిధులు కేటాయిస్తుందనే ఆశిస్తున్నారు. రాష్ట్ర వాటా బకాయిలు విడుదల అవుతాయని భావిస్తున్నారు.

ఉత్కర్ష్ ప్రతిపాదన

ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్ పురస్కరించుకుని రాష్ట్రంలో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర బడ్జెటులో సముచిత ఆదరణ దక్కుతుందనే ఆశాభావం సర్వత్రా విశ్వాసం వ్యక్తమవుతోంది. సుందర్‌గడ్ లేదా కొరాపుట్ జిల్లాలో ఇలాంటి ఈ విశ్వ విద్యాలయం నెలకొల్పేందుకు ప్రతిపాదించారు. గత రెండున్నర దశాబ్దాలుగా రాజకీయ కారణాలతో ఒడిశాకు కేంద్రం నుంచి మద్దతు లభించడం లేదు. అయితే రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల కేంద్రం సహకారం ఏ మేరకు ఉంటుందనేది వేచి చూడాలి.

• జగన్నాథ రక్షమాం

3 అడుగుల ఎత్తు, 2 అడుగుల వెడల్పుతో పద్మ అలంకరణ నమూనాతో రూపు దిద్దుకున్న ఈ అద్భుత కళాఖండం ఐస్ క్రీమ్ స్టిక్‌లతో తయారు చేశారు. పూరీలో ఉంటున్న బిశ్వజిత్ నాయక్ 4 రోజులు నిరవధికంగా శ్రమించి తయారు చేశాడు. దీని తయారీలో మొత్తం 1,575 ఐస్‌క్రీమ్ స్టిక్‌లు ఉపయోగించినట్లు తెలిపాడు. దీన్ని స్వామి భక్తులకు అంకితం చేసినట్లు పేర్కొన్నాడు. – భువనేశ్వర్



రాగులు ఇవ్వలేదని ఆరోపణ



బీడీఓకు మెమోరాండం సమర్పిస్తున్న గ్రామ వాసులు

జయపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రేషన్ కార్డు దారునికి 60 కేజీల రాగులు అందజేయాలని ప్రభుత్వ డీలర్లను ఆదేశించారు. ఆ మేరకు డీలర్‌కు రాగులు (చోళ్లు) సమకూర్చారు. అయితే నేటి వరకు తమకు రాగులు డిపో యజమాని ఇవ్వలేదని కొట్‌పాడ్ సమితి కుసుమి గ్రామ పంచాయతీలో సిమిలిగుడ, బందగుడ, కువాగాం గ్రామాల రేషన్ కార్డుల లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. వారు శుక్రవారం కొట్‌పాడ్ బీడీఓను కలసి వినతి పత్రం సమర్పించారు. మూడు నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు 60 కేజీల చొప్పున రాగులు ఇస్తామని ప్రకటించింది. రాగులు కూడా డీలర్ల వద్దకు వచ్చాయి. అయితే అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు రాగులు ఇవ్వలేదని సిమిలిగుడ,బందగుడ,కువాగాం గ్రామాల ప్రజలు వినతి పత్రంలో వెల్లడించారు. తాము డిపో డీలర్‌ను ఎన్నిసార్లు అడిగినా సమాధానం దాటవేశాడని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధికారులకు తెలిపినా ఫలితం లేదన్నారు. వస్తున్నది వేసవి కాలం కావున తమకు రాగులు అందజేయాలని వారు విజ్ఞప్తి చేశారు. చోళ్లు తక్కువ వచ్చాయని, వచ్చిన వెంటనే అందరికీ ఇస్తామని బీడీఓ హామీ ఇవ్వటంతో వారు వెనుదిరిగారు. అయితే 15 దినాల్లోగా చోళ్లు ఇవ్వకపోతే తాము పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేస్తామన్నారు. మెమోరాండం సమర్పించిన వారిలో లబకుశ దొర, రొయితన్ హరిజన్, గుప్త గౌఢ, సదాశివ భూమియ, ముక్త దొర, లక్ష్మీరౌత్, విశ్వనాథ్ గౌఢ తదితరులు ఉన్నారు.

చట్టాలపై న్యాయ కళాశాల విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న లోక్ అదాలత్ ప్రతినిధి సచిన్ జెన



పాల్గొన్న న్యాయకళాశాల విద్యార్థులు

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రదీకరణ ఆధ్వర్యంలో బమిణిగాం గ్రామ సమీపంలోని జయపురం న్యాయ కళాశాలలోని విద్యార్థులకు చట్టాలపై అవగాహన శిబిరాన్ని శుక్రవారం కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా ప్రదీకరణ జయపురం, లోక్ అదాలత్ శాశ్వత విచారణపతి సుమన్‌జెన ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన న్యాయ కళాశాలలకు చట్టాల గురించి వివరించారు. ముఖ్యంగా ఉద్యోగాలలో ఉన్న మహిళలపై జరుగుతున్న అత్యాచారాల నిరోధక చట్టం, రాజ్యాంగంలో మహిళలు, ప్రజలకు కల్పించిన అధికారాలను తెలియజేశారు. శిబిరంలో జయపురం చీఫ్ డిప్యూటీ లీగల్ అండ్ డిప్యూటీ కౌన్సిల్ కె.దివాకరరావు, జయపురం న్యాయ కళాశాల అధ్యక్షులు చింతామణి బెహర, న్యాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవీంద్రకుమార్ స్వై పాల్గొన్నారు.

రాష్ట్ర శాసన సభ కొత్త కార్యదర్శి సత్యబ్రత రౌత్



సత్యబ్రత రౌత్

భువనేశ్వర్: ఐఏఎస్ సత్యబ్రత్ రౌత్ రాష్ట్ర శాసన సభ కొత్త కార్యదర్శిగా నియమితులు అయ్యారు. దాశరథి శత్పతి స్థానంలో కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజా పాలన విభాగం శుక్ర వారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన రాష్ట్ర హోం వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఓఏఎస్ నుంచి ఐఏఎస్‌గా పదోన్నతి పొందారు. ఆర్థిక శాఖలో చాలా ఏళ్లపాటు ముఖ్యమైన పదవులు నిర్వహించారు.

రైల్వే ఎలక్ట్రిక్ ట్రాక్సన్‌కు 'వంద'నం



ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం, సిబ్బంది

రాయగడ: భారత రైల్వే ఎలక్ట్రిక్ ట్రాక్సన్ సేవలు అందించి వందేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ నుంచి రైల్వే విభాగం తరఫున శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డీఆర్ఎం (రాయగడ డివిజన్) అమితాబ్ సింఘాల్, రైల్వే అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అశోకా టాకీస్, పిడబ్ల్యూడీ రోడ్డు మీదుగా కొనసాగింది. 1925 జనవరి 31వ తేదీన భారత రైల్వే శాఖ రైల్వే సేవల్లో భాగంగా ఎలక్ట్రిక్ ట్రాక్సన్ సేవలను ప్రారంభించింది. ఈ సేవలు నిర్విఘ్నంగా వందేళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమని డీఆర్ఎం సింఘాల్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

విద్యార్థులకు లక్ష్యం ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: జీవితంలో ఏదైనా సాధించాలంటే విద్యార్థులకు ఒక లక్ష్యం ఉండాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక గజపతి నగర్‌లో ఉన్న మహిళా ఉన్నత మాధ్యమిక కళాశాల 39వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి మాట్లాడుతూ.. దివంగత ఎమ్మెల్యే త్రినాథ సాహు మహిళా కళాశాలకు అంకురార్పణ చేశారని, తదుపరి దినాదినాభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.మనస్వినీ దాస్, మాజీ ప్రిన్సిపాల్ డా.శంకర్ ప్రసాద్ భక్షి, నృసింహాప్రసాద్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

అద్దెలు చెల్లించని దుకాణాలకు తాళాలు



జయపురం దేవదాయ దుకాణాల అద్దె బకాయిలు వసూలు చేస్తున్న తహసీల్దార్ తదితరులు

జయపురం: జయపురం దేవదాయ విభాగ అధికారులు అద్దెలు చెల్లించని రెండు దుకాణాలను సీజ్ చేశారు. శుక్రవారం జయపురం దేవదాయ అధికారి, తహసీల్దార్ సవ్యసాచి జెన నేతృత్వంలో పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి, దేవదాయ విభాగ హెడ్ క్లర్క్ కృష్ణ చంద్ర దాస్, క్లర్క్‌లు శుభమ్ మిశ్ర, కాశీ ప్రసాద్ దాస్ పోలీసులు పాల్గొన్నారు. దేవదాయ విభాగానికి 70 దుకాణాలు ఉన్నాయని, వాటిలో 19 దుకాణాల యజమానులు ఎంతో కాలం నుంచి అద్దెలు చెల్లించటం లేదని అధికారులు వెల్లడించారు. తాము ఎన్ని నోటీసులు పంపించినా చలించకపోవడంతో జనవరి 31 గడువు ఇచ్చామన్నారు. 19 దుకాణదారుల్లో 17 మంది చెల్లించారని మిగిలిన రెండు దుకాణాలు సీజ్ చేశామని తెలిపారు.

ఉత్సాహంగా అథ్లెటిక్ మీట్

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయం వారు పూల్‌బెడ ప్రాంతంలోగల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం అంతర్‌కళాశాలల అథ్లెటిక్ మీట్ ప్రారంభించారు. వర్సిటీ ఆధీనంలో గల 30 కళాశాలల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు 13 అంశాల్లో పోటీలు జరిగాయి. 26 వ జాతీయ రహదారి లోగల ధన్‌పూర్ బ్రాంచ్ కెనాల్ తెలిగుడ గ్రామంలోగల రాధాకృష్ణ మందిరంలో క్రీడాకారులు పూజలు చేసి క్రీడా జ్యోతిని వెలిగించారు. అక్కడి నుంచి క్రీడాజ్యోతితో ర్యాలీ నిర్వహించి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రంజన్ కుమార్ ప్రధాన్ లాంఛనంగా పోటీలు ప్రారంభించారు. విశ్వవిద్యాలయ క్రీడా పరిచాలన కమిటీ కార్యదర్శి సచిన్ కుమార్ నాయిక్ ప్రారంభ ప్రసంగం చేశారు.

800 మీటర్ల పరుగు పందెంలో నందపూర్ సిద్ది దేవ్ కళాశాల బిపిన్ పంగి ప్రథమ స్థానంలో నిలిచాడు. 1500 మీటర్ల పరుగు పందెంలో కుంద్ర బిజూ పట్నాయిక్ విద్యార్థి కళాశాల విద్యార్థి సంతోష్ పారజ, షాట్‌పుట్ పోటీలో జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ రోహిత్ కుమార్ దాస్, లాంగ్ జంప్ పోటీలో విక్రమదేవ్ విశ్వవిద్యాయ విద్యార్థి సుమన్ ముదులి, హైజంప్‌లో నవరంగపూర్ ఎండీకళాశాల విద్యార్థి తులసీ రాం మఝి, జావెలిన్ త్రోలో సెమిలిగుడ డిగ్రీ కళాశాల విద్యార్థి నరశింగ మఝి ప్రథమ స్థానంలో నిలిచారు.

విద్యార్థినులకు నిర్వహించిన 200 మీటర్ల పరుగు పందెంలో కొరాపుట్ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని జానకీ చకన, 800 మీటర్ల పరుగు పందెంలో బొరిగుమ్మ డిగ్రీ కళాశాల విద్యార్థిని దయామణి హరిజన్, షాట్ పుట్, జావెలిన్ త్రో పోటీల్లో సెమిలిగుడ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని బబిత దొర, డిస్కస్ త్రో పోటీలో కొరాపుట్ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ఝూన్సీ ఖోశల, హైజంప్‌లో రాయగడ స్వయం సాసిత కళాశాలలో విద్యార్థిని దీపిక బిడిక, లాంగ్ జంప్‌లో సెమిలిగుడ డిగ్రీ కళాశాల విద్యార్థిని రాణి పాణి ప్రథమ స్థానాల్లో నిలిచారు.



పరుగు పందెంలో క్రీడాకారులు





క్రీడా జ్యోతిని స్వీకరిస్తున్న రిజిస్ట్రార్ రంజన్ కుమార్ ప్రధాన్, వివిధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు

క్లుప్తంగా

వసంత పంచమికి సన్నద్ధం



సరస్వతీ దేవి విగ్రహాల తయారీలో కళాకారుడు

పర్లాకిమిడి: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో వసంత పంచమికి ఏర్పాట్లు చేస్తున్నారు. వసంత మాసంలో వచ్చే పంచమిని రాష్ట్రంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. దీంతో స్థానిక చిత్రకార వీధిలో సరస్వతీ దేవి విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమై ఉన్నారు. ఫిబ్రవరి 2వ తేదీన సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో పిల్లలకు అక్షరాభ్యాసాలు చేపట్టనున్నారు. అదేరోజు గుండిచాబడి ప్రాంతంలో ఉన్న గాయత్రీ మందిరంలో పిల్లలకు విద్యాభ్యాసాలు, గాయత్రీ హోమాలు జరుగుతాయని గాయత్రీ పరివార్ కమిటీ సభ్యులు తెలియజేశారు.

85 క్వింటాళ్ల ధాన్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ధాన్యం బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి యం.వి.79 గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన 85 కింటాళ్ల ధాన్యాన్ని జిల్లా సివిల్ సప్లై డిపార్ట్ పోలీసులు సయుక్తంగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండీలకు ధాన్యాన్ని రాతీయకుండా రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలించేందుకు ధాన్యాన్ని సిద్ధంగా ఉంచినట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేపట్టారు. యం.వి.79 గ్రామానికి చెందిన వ్యాపారి దీపంకర్ దేవనాథ్ అనే వ్యక్తికి చెందినివిగా గుర్తించారు. ధాన్యం బస్తాలను స్వాధీనం చేసుకున్న అధికారులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈత విజేతలు



ఈత స్వర్ణ పతకం విజేతల బృందం

భువనేశ్వర్: రాష్ట్ర మహిళా స్విమ్మర్లు స్వర్ణ పతకం సాధించారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడల్లో మహిళల ఈత పోటీల్లో ఈ విజయం సాధించారు. 4 "100 మెడ్లే రిలే ఈత పోటీలో స్వర్ణ పతకం గెలుచుకున్నారు. ఈ విజేతల బృందంలో మన్నత మిశ్రా, ప్రత్యస రే, దివ్యాంక ప్రధాన్ మరియు సృష్టి ఉపాధ్యాయ ఉన్నారు. వీరందరికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యేకంగా అభినందించారు.

7 నుంచి నాటిక పోటీలు

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 7, 8, 9వ తేదీలలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రంగస్థలం కళాకారుల సంఘం అధ్యక్షుడు తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు.



బ్యాటింగ్ చేస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎం మోహన్‌చరణ్



థీమ్ సాంగ్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

వన్డే మ్యాచ్‌కు సర్వం సిద్ధం

- బారాబటి స్టేడియం పరిశీలించిన సీఎం మోహన్‌చరణ్
- ఈనెల 9వ తేదీన ఇంగ్లాండ్ – ఇండియా మధ్య మ్యాచ్

భువనేశ్వర్: భారత్ – ఇంగ్లండ్ మధ్య ఈనెల 9వ తేదీన జరగనున్న వన్డే మ్యాచ్‌కు కటక్ బారాబటి స్టేడియం సిద్ధమవుతోంది. ఈ మేరకు ఏర్పాట్లను సీఎం మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా శుక్రవారం పరిశీలించి సమీక్షించారు. సుమారు రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ వన్డే క్రికెట్ మ్యాచ్ ఈ స్టేడియంలో జరుగనుంది. దీంతో సన్నాహాలపై సీఎం మాఝి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు ప్రేమానంద్ స్వరపరిచిన స్వాగత్.. సుస్వాగత్ అనే మ్యాచ్ థీమ్ సాంగ్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ను బారాబటి స్టేడియంలో నిర్వహించడం మన అదృష్టమన్నారు. ఒడిశా క్రికెట్ అసోసియేషన్(ఓసీఏ), స్థానిక జిల్లా అధికార యంత్రాంగం, రాష్ట్ర పాలన యంత్రాంగం సమన్వయ కృషితో ఈ మ్యాచ్ నిర్వహణ జయప్రదం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి సూర్య వంశీ సూరజ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయన్నారు. సీఎంతో పాటు క్రీడలు మరియు యువజన సేవల మంత్రి సూర్యవంశీ సూరజ్, ముఖ్యమంత్రి సలహాదారు ప్రకాష్ మిశ్రా, అడ్వకేట్ జనరల్ పీతంబర్ ఆచార్య, అంగుల్ ఎమ్మెల్యే మరియు ఓసీఏ మండలి సభ్యుడు ప్రతాప్ చంద్ర ప్రధాన్, బొడొంబా ఎమ్మెల్యే విజయ్ కుమార్ దాలబెహరా, కటక్ సదర్ ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర సేఠి, బంకి ఎమ్మెల్యే దేవి రంజన్ త్రిపాఠి, మాజీ ఎమ్మెల్యే లలితేందు విద్యాధర మహాపాత్రో, ఓసీఏ కార్యదర్శి సంజయ్ బెహరా ఉన్నారు.

ఒత్తిడి నివారణే ధ్యేయం



లోకో పైలట్ల శిక్షణ శిబిరంలో పాల్గొన్న డీఆర్‌ఎంతో ఇతర ప్రముఖులు

భువనేశ్వర్: రేయింబవళ్లు పట్టాలపై రైళ్లని పరుగులు తీయించే లోకో పైలట్ల జీవన విధానం ఇతరులతో భిన్నంగా ఉంటుంది. ఉద్యోగ బాధ్యతల నిర్వహణ, సామాజిక జీవనం సమతుల్యత వీరికి పెను సవాలు. ఈ రెండింటి మధ్య లోకో పైలట్లకు ప్రశాంతత కల్పించే దిశలో తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం ఒత్తిడి నివారణ శిక్షణ శిబిరం నిర్వహించింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమం శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ప్రశాంతత, ఏకాగ్రత, సముచిత ఆలోచన అత్యంత శక్తివంతమైనవని శిక్షణ కార్యక్రమం నిర్వహించిన లలిత్ మహంతి తెలిపారు. ఒత్తిడి ఉపశమనం వ్యక్తిగత అభివృద్ధి, శ్రేయస్సుకు బలమైన వారధి అని పేర్కొన్నారు. దైనందిన జీవనంలో తేలికపాటి మెలకువలతో ప్రశాంత జీవన శైలిని శిక్షణకు హాజరైన అభ్యర్థుల్లో అవగాహన కల్పించారు.

ప్రశాంత జీవనం మెలకువలు

ఉఛ్వాస, నిశ్వాస మెలకువలతో సుస్థిర ధ్యాన శైలితో ఒత్తిడి నివారణ శైలిని నేర్పించారు. మెరుగైన మానసిక ప్రశాంతత భావోద్వేగ నియంత్రణపై పట్టు సాధించి సానుకూల దృక్పథం ప్రేరేపిస్తుందన్నారు. సారూప్య వ్యక్తులతో పరిచయం, స్నేహశైలి నిర్మాణాత్మక సమాజ ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దుతుంది. మెరుగైన హావభావాల వ్యక్తీకరణ శైలితో వ్యక్తిగత, వృత్తిపరమైన సంబంధాలను పెంపొందించి ఒత్తిడి రహిత సామాజిక జీవనానికి నాందిగా నిలుస్తుందని తెలిపారు. లోకో పైలట్లకు ఒత్తిడి రహిత శిక్షణతో ప్రశాంత మానసిక, కుటుంబ, విధి నిర్వహణ మెలకువల్ని తెలియజేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించామని ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం హెచ్‌ఎస్ బజ్వా తెలిపారు. ఈ దశలో మండలం పరిధిలో పారాదీప్, జఖ్‌పురా, ఖుర్దా రోడ్, భద్రక్, కటక్, ఛత్రపూర్, పలాస, కెంజొహర్ స్టేషన్ల నుంచి 34 మంది లోకో పైలట్లు, సహాయ లోకో పైలట్లు శిక్షణ పొందారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రముఖ ఫ్యాకల్టీ సభ్యులు లలిత్ కుమార్‌మహంతి, ప్రదీప్తకుమార్ పట్నాయక్. హెచ్. కె.దత్త లోకో పైలట్‌ల శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు.



శిక్షణ పొందిన లోకో పైలట్లతో అనుబంధ యంత్రాంగం

శ్వాస నియంత్రణ కీలకం



రెప్పపాటు ప్రమాదం పొంచి ఉన్న లోకో పైలట్ ఉద్యోగ జీవనంలో ఒత్తిడి లేని జీవన సోపానాల ఆవిష్కరణకు ఈ శిక్షణ ప్రేరేపించింది. ప్రధానంగా శ్వాస నియంత్రణ మెలకువలు ఉన్నతమైన మానసిక ప్రశాంతతతో ఉత్తమ ఆరోగ్య జీవనం ప్రసాదిస్తుందని ఈ శిక్షణ నేర్పింది. ప్రతి ఒక్కరి దైనందిన జీవనంలో ఈ శైలి కళాత్మక జీవిత విధానాల్ని అలవరస్తుంది.

– జి. మురహరి, లోకో పైలట్, ఖుర్దారోడ్

ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు



ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పట్వారి, ఏఎస్పీ పాత్రో తదితరులు

రాయగడ: జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన రోడ్డు భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. స్థానిక బిజుపట్నాయక్ ఆడిటోరియంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి హాజరై మాట్లాడారు. ప్రపంచంలోనే మనదేశంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అందుకే ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి రోడ్డు ప్రమాదాల నివారణకు దేశవ్యాప్తంగా నడుం బిగించారన్నారు. ఈ క్రమంలోనే ఈసారి జిల్లాలో కూడా రోడ్డు భద్రత మాసొత్సవాలను నిర్వహించడం జరిగిందని అన్నారు. అధిక రోడ్డు ప్రమాదాలు మద్యం తాగి వాహనాలను నడపడం, నిర్లక్ష్యంగా ఉండడం కారణంగా చోటు చేసుకుంటున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి బిష్ణుప్రసాద్ పాత్రో, ఆర్డీవో శివ శంకర్ చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహారో పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ బాధ్యతల స్వీకరణ



మధుసూదన్ పాఢి

భువనేశ్వర్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా మధుసూదన్ పాఢి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పదవీ విరమణ చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదిత్య ప్రసాద్ పాఢి ఆయనకు బాధ్యతలను అప్పగించారు. ఆదిత్య ప్రసాద్ పాఢి పదవీ కాలం గత ఏడాది ఆగస్టు నెలలో ముగియడంతో ఈ స్థానం ఖాళీగా ఉంది. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగనున్న పట్టణ, నగర పాలక సంస్థలు, పంచాయతీ ఎన్నికలను ప్రజాస్వామ్య ప్రక్రియలో సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తానన్నారు. మధుసూదన్‌పాఢి 8వ రాష్ట్ర ఎన్నికల కమిషనరు. 1991 సంవత్సరం బ్యాచ్ ఐఏఎస్ అధికారి. సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో రాష్ట్ర ప్రభుత్వంలో అనేక కీలక పదవుల్లో బాధ్యతలను నిర్వహించారు. ఓంఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఆహార సరఫరాలు మరియు వినియోగదారుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, రవాణా కమిషనర్‌గా, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశారు.

రాతికర్ర, జలగల చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలి



రాతికర్ర చెరువు



జలగల చెరువు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో చెరువుల ఆక్రమణలపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఇప్పటికే రాజుల చెరువులో ఆక్రమణలపై గరీబు గైడు అనే స్వచ్ఛంద సంస్థ జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసింది. దీనిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అదే సంస్థ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు న్యాయవాది డీవీ రావు నరసన్నపేటలోని రాతికర్ర చెరువు, జలగల చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని, చెరువులకు పూర్వ రూపం తీసుకురావాలని జిల్లా అధికారులకు అత్యవసర నోటీసులు శుక్రవారం పంపారు. ఒకవైపు చెరువుల స్థలాల్లో ఎటువంటి క్రయవిక్రయాలు జరగకూడదని, ఇవి నిషేధిత భూములని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని.. మరో వైపు కొందరికి డీపట్టాలు ఎలా ఇస్తారని.. చెరువులు ఆక్రమణలకు గురవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని నోటీసులో పేర్కొన్నారు. ఆక్రమణలు వెంటనే తొలగించకపోతే జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేస్తామని స్పష్టం చేశారు. రాతికర్ర చెరువు విస్తీర్ణం 2.75 ఎకరాలు కాగా 2.11 ఎకరాలు ఆక్రమణకు గురైందని, జలగల చెరువు విస్తీర్ణం 13.22 ఎకరాలు కాగా చాలా మేరకు ఆక్రమణలు జరిగియాని తెలిపారు.

గంజాయితో ఇద్దరు మహిళలు అరెస్టు



గంజాయితో పట్టుబడిన మహిళలు

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఇద్దరు మహిళలు గంజాయి రవాణా చేస్తుండగా ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డారు. వారి నుంచి 20.320 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు. శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. ఎప్పటిలాగే ఎక్సైజ్ వోఐసీ సంజయ్ కుమార్ ప్రధాన్, ఏఎస్ఐ రాసి నాయక్, రామేశ్వర్ బెహర ఇతర సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రైల్వే స్టేషన్ బయట ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులను తనిఖీ చేశారు. దీంతో బ్యాగులో గంజాయి పట్టుబడింది. పట్టుబడిన మహిళలు తమిళనాడుకు చెందిన పి.లత, ఎం.రథలుగా అధికారులు గుర్తించారు.

నేడు ఇంటర్ విద్యార్థులకు 'నైతికత' పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ : ఇంటర్మీడియెట్ పరీక్షల పర్వం శనివారం నుంచి ప్రారంభం కానుంది. 1న ఫస్టియర్ విద్యార్థులకు నైతికత, మానవతా విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్ష, 3న పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పరీక్ష జరగనుంది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నాయి.

రేపు ఒడిశాకు అప్పన్న ప్రచార రథం



అప్పన్న ప్రచార రథం

- 3 నుంచి 6వ తేదీ వరకు ఆ రాష్ట్రంలో శ్రీనృసింహ హోమాలు
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సహాలు
- లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఆధ్వర్యంలో నిర్వహణ

సింహాచలం: సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలో పర్యటించనుందని ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. ఏటా సింహగిరిపై మూడు నెలల పాటు ఉండి స్వామికి సేవలందిస్తున్న ఒడిశాలోని పట్టుపురానికి చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఆధ్వర్యంలో పలు చోట్ల స్వామి కల్యాణోత్సవాలు జరగనున్నాయని వివరించారు. ఈ నెల 2న మధ్యాహ్నం సింహాచలం నుంచి ప్రచార రథం ఒడిశా బయలుదేరుతుందన్నారు. బరంపురం సమీపంలోని పట్టుపురంలో 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ నృసింహహోమం, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు స్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. పద్మనాభపురంలో 4న ఉదయం 9 గంటల నుంచి శ్రీనృసింహ హోమం, సాయంత్రం 5 గంటల నుంచి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. విష్ణుచక్రపురంలో 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు, అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హండీఘర్‌లో కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. 6న ఉదయం 10 గంటల నుంచి చికిడీలో కల్యాణోత్సవం నిర్వహించిన అనంతరం, మధ్యాహ్నం 2 గంటలకు ప్రచార రథం తిరిగి సింహాచలం బయలుదేరుతుందని వివరించారు. రథంతో పాటు దేవస్థానం ఉద్యోగులు, వైదికులు తరలి వెళ్తారని పేర్కొన్నారు.

దర్శనాల్లో వీఐపీ ట్రీట్‌మెంట్ రద్దు!

- ఎన్నికల కోడ్ అమలుతో రథసప్తమి దర్శనాలకు కొత్త ఆంక్షలు
- నేటి నుంచి యూనియన్ బ్యాంక్‌లో రూ.300 దర్శన టికెట్లు
- మధ్యాహ్నం నుంచి దాతల పాసుల పంపిణీ
- దర్శన మార్గాలపై కానరాని స్పష్టత

అరసవల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పుణ్యమా అని అరసవల్లిలో ఈ నెల 3వ తేది అర్ధరాత్రి నుంచి జరగనున్న రథసప్తమి మహోత్సవానికి ప్రత్యేక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. కోడ్ నిబంధనల మేరకు ప్రోటోకాల్ దర్శనాలు, వీవీఐపి ట్రీట్‌మెంట్ దర్శనాలన్నీ దాదాపుగా రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హోదాలో వివిధ రకాల ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేయడంతో అరసవల్లిలో ప్రస్తుతానికి ప్రశాంత వాతావరణం నెలకొంది. ఇంతవరకు ఏర్పాట్ల నిర్వహణ అంశంలో వరుసగా పర్యటనలు, పర్యవేక్షణ చేసిన ప్రజాప్రతినిధులు హడావుడి తగ్గడంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు. సజావుగా భక్తుల దర్శనాలు జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నారు. ఇదిలావుంటే ఇంతవరకు వివిధ దర్శనాల మార్గాలపై స్పష్టత కరువైంది. గురువారం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ నేరుగా అరసవల్లిలో ఏర్పాట్లను పరిశీలించిన క్రమంలో కూడా పూర్తిస్థాయిగా దర్శన మార్గాలు ఖరారు కాలేదని గుర్తించారు. దీనిపై ఈ నెల 2 లోగా అన్ని మార్గాలు ఫైనలైజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ప్రత్యేకంగా ఆలయ ఈవో వై.భద్రాజీకి సూచించారు. కోడ్ అమల్లో ఉండడంతో ఆహ్వాన పత్రికల నుంచి టిక్కెట్ల ముద్రణ వరకు అన్నింటిలోనూ మార్పులు చేయాల్సి వచ్చింది.



యూనియన్ బ్యాంక్‌లో టికెట్లు..

రథసప్తమి నాడు వీఐపీ మార్గంలో దర్శనాలు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.300 దర్శన టికెట్లను కొత్తగా అమల్లోకి తెచ్చారు. వీటిని శనివారం ఉదయం నుంచి అరసవల్లి యూనియన్ బ్యాంకులో నాలుగు స్లాట్‌లలో మొత్తం 6 వేల టిక్కెట్లను విక్రయించేలా చర్యలు చేపట్టారు. ఒక్కో స్లాట్ టైమింగ్ ద్వారా 1500 మందికి ప్రత్యేక దర్శన మార్గంలో అనుమతించనున్నారు. ఈమేరకు దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆమోదం తెలియజేయడంతో ఈవో వై.భద్రాజీ శుక్రవారం చర్యలు చేపట్టారు.

యథావిధిగా క్షీరాభిషేక సేవ టికెట్లు..

రథసప్తమి నాడు అంటే ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటల నుంచి 4వ తేదీ ఉదయం 7 గంటల వరకు నిజరూప దర్శనంతో పాటు గర్భాలయంలో ఆదిత్యుని మూలవిరాట్టుకు పంచామృతాలతో పాటు క్షీరాభిషేక సేవ జరగనుంది. ఈసేవకు గాను రూ.500 టికెట్లను (ఇద్దరికి అనుమతి) ఎప్పటిలాగానే క్యూలైన్లోనే విక్రయించేలా ఏర్పాట్లు చేశారు.

పేరుకు ఒకటే డోనర్ పాసు...!

ఏటా రథసప్తమి ఉత్సవానికి వీఐపీల తాకిడితో పాటు దాతల పాసుదారుల హడావుడి అధికమవుతూ ఉంది. సజావుగా దర్శనం జరిగేలా విశిష్ట మార్గంలో స్వామిని దర్శించుకునేందుకు చాలా మంది భక్తులు ఆలయానికి అభివృద్ధి, ఇతరత్రా నిర్మాణాలు చేయించి రూ.లక్షకు మించి విరాళాలు ఇస్తున్న సంగతి విదితమే. ఇలా రూ.లక్ష ఇచ్చిన దాత కుటుంబ సభ్యులు నలుగురికి అనుమతించేలా ఒక డోనర్ పాసు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది. ప్రస్తుతానికి ఈ పాసుల సంఖ్య 1180 వరకు చేరింది. ఇందులో రూ.ఒక లక్ష వరకు విరాళాలు ఇచ్చిన వారు 800 మంది వరకు ఉంటారు. మిగిలిన దాతలు రూ.లక్ష నుంచి రూ.5 లక్షలలోపు అలాగే రూ.10 లక్షలలోపు అంతకుమించి కూడా విరాళాలచ్చిన దాతలున్నారు. ఇప్పుడు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు రూపంలో ఆలయ దాతలకు ఆంక్షలు అమలు కానున్నాయి. ఒకే దాత పేరుతో ఎన్ని లక్షలు విరాళాలిచ్చినా.. ఒకే పాసు ఇవ్వాలంటూ ఇటీవల మంత్రి అచ్చెన్న ఆదేశించడంతో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో వై.భద్రాజీలు సర్దిచెప్పినా మంత్రి నిర్ణయాన్ని వెనక్కితీసుకోలేదు. దీంతో ఒక దాత పేరుకు ఒకటే డోనర్ పాసు ఇచ్చేందుకు ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈ నిర్ణయంపై దాతలు తీవ్ర ఆందోళన, అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. గత రథసప్తమికి లేని నిబంధనలను ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వంలో అమలుకు తేవడంపై అన్ని రంగాల వ్యక్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని అమలు చేసేలా ప్రస్తుత పరిస్థితులుండడంతో శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి దాతల పాసులను ఇచ్చే కార్యక్రమాన్ని ఆలయ అధికారులు ప్రారంభించనున్నారు. కాగా, ఇటీవల రిజిస్ట్రేషన్ చేసే సమయంలోనైనా ఒకరికి ఒక పాసే అని చెప్పుంటే రూ.లక్షకు మించిన విరాళాలను వారి కుటుంబసభ్యులు షేరింగ్‌తో పాసుల సంఖ్య పెరిగేలా చేసుకునేవాళ్లమని చాలా మంది దాతలు అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి ప్రకటనలు చేయకుండా దాతలకు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ పెట్టేసి 'పాసులిచ్చేస్తున్నామని.. సహకరించాలంటూ...' మెసేజీలు పెట్టేయడంపై దాతలు మండిపడుతున్నారు.

బీజేపీ శ్రేణుల నిరసన



ఆందోళనలో బీజేపీ శ్రేణులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు బ్లాక్ అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, ఉపాధ్యక్షుడు జ్యోతి పాణికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన జరిపారు. ముందుగా రాయఘడ సంతపేట నుంచి ర్యాలీ చేపట్టగా.. బీజేపీ మండలాధ్యక్షులు ప్రశాంత్‌కుమార్ ప్రధాన్, ప్రతాప్ పాయక్ ప్రాతినిథ్యం వహించారు. ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు రాయఘడ బ్లాక్ అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, ఉపాధ్యక్షులు జ్యోతిపాణికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆమె దిష్టిబొమ్మను దహనం చేశారు. రాయఘడ బ్లాక్‌లో అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్ భర్త బీజేడీ నాయకులు అంతర్యామి గోమాంగో తన స్వంత వ్యక్తులకు టెండర్లు, మహాత్మాగాంధీ ఉపాధి పథకంలో తన స్వంత పార్టీ కార్యకర్తలకు పనులు, పనిముట్లు కోనుగోళ్లలో ప్రధాన పాత్ర పోషించారని బీజేపీ నాయకులు ప్రశాంత్ కుమార్ ప్రధాన్ ఆరోపించారు. రాయఘడ బ్లాక్‌లో పొరుగుసేవల ఉద్యోగుల కాంట్రాక్టు రెన్యువల్ చేయాలంటే బ్లాక్ అధ్యక్షురాలు భర్త అంతర్యామి గోమాంగో మధ్యవర్తిత్వంతో లంచాలు తీసుకుని రెన్యువల్ చేస్తున్నారన్నార. ఇవే కాక పీడీఎస్ పంపకంలో అవినీతి కార్యకలాపాలు, మహేంద్రగిరి అభివృద్ధి కమిటీలో ప్రధానపాత్ర పోషించటం వంటి అనేక అవినీతి పనులకు ఆయన పాల్పడుతున్నాడన్నారు. అందువల్ల జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ రాయఘడ బ్లాక్ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షులుపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు గురువారం బీజేపీ శ్రేణులు ఫిర్యాదు చేశారు. ఆందోళనలో బీజేపీ రాయఘడ బ్లాక్ నాయకులు, జగన్నాథ భుయ్యాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీబీవీల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవానందరెడ్డి

పార్వతీపురం టౌన్: కేజీబీవీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కేజీబీవీల రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి అన్నారు. పార్వతీపురం ప్రభుత్వ బాలికల పాఠశాలలో కేజీబీవీల ప్రిన్సిపాళ్లతో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ క్లాస్, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల అభ్యసన నైపుణ్యాల్ని పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. విద్యార్థులకు పరీక్షలంటే భయంపోయేలా చైతన్యపరచాలన్నారు. విద్యా విషయాలతో పాటు మానసిక వికాసాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈఓ ఎన్.తిరుపతిరావు, జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పార్వతీపురం టౌన్: మండలంలోని వెంకంపేట గ్రామ శివారుల్లో మామిడి తోట వద్ద పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం తనిఖీ చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. రూరల్ ఎస్ఐ సంతోషి తెలిపిన వివరాలు.. మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3,450 స్వాధీనం చేసుకున్నటు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గజరాజుల విధ్వంసం



రైస్ మిల్లులో ధాన్యం బస్తాలను చిందర వందర చేసిన ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద ఉన్న రైస్ మిల్లు తలుపులను గజరాజులు గురువారం రాత్రి పగులగొట్టి అందులోని ధాన్యం బస్తాలను ధ్వంసం చేశాయి. శుక్రవారం ఉదయం అరటి, పామాయిల్ తోటల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేశాయని స్థానికులు తెలిపారు. అయినా అటవీ శాఖాధికారుల జాడ లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన



వావిలపాడు పరుగు ప్రదర్శనలో పరుగు తీస్తున్న ఎడ్లు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ దేవత పరదేశమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో 16 ఏడ్లు జతలు పాల్గొన్నాయి. వీటిలో వల్లంపూడి సిద్ది వినాయక ఎడ్లు మొదటి స్థానంలో నిలిచి రూ.18వేలు, చుక్కపల్లి నీమాలమ్మ తల్లి ఎడ్లు రెండో స్థానంలో నిలిచి రూ.15వేలు, గండి వెంకటరావు ఎడ్లు మూడో స్థానంలో నిలిచి రూ.12వేలు, కేఎల్‌బీ పట్నంకు చెందిన బండారు హేమతేజ ఎడ్లు నాల్గో స్థానంలో నిలిచి రూ.10వేలు, సద్దివినాయక లెక్కలవానిపాలెం ఎడ్లు ఐదో స్థానంలో నిలిచి రూ.8వేలు నగదు బహుమతులు గెలుచుకున్నాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగదు బహుమతులను డీసీసీబీ మాజీ చైర్మన్ చినరాము నాయుడు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు రూ.50 వేలు లంచం

గుర్ల: కూటమి ప్రభుత్వంలో ఉపాధిహామీ పోస్టులను అమ్మకానికి పెట్టారా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు భారీ మొత్తంలో లంచాలు వసూలు చేస్తున్నారు. ఎక్కువ మొత్తం ముట్టజెప్పిన వారికి పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నారు. దీనికి గుర్ల మండలంలోని మణ్యపురిపేటలో ఫీల్డు అసిస్టెంట్ నియామకంలో వెలుగులోకి వచ్చిన అవినీతి తంతే నిలువెత్తు సాక్ష్యం. గ్రామానికి చెందిన గార రామలక్ష్మి సీనియర్ మేట్‌గా కొనసాగుతోంది. ఆమె ఆధ్వర్యంలో గ్రామంలో ఉపాధి హామీ పనులు సాగుతున్నాయి. రెండు నెలల కిందట రామలక్ష్మిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించాలని సర్పంచ్ బడుగంటి హైమవతి గ్రామసభ తీర్మానం చేసి ఏపీఓ కామేశ్వరరావుకు పంపించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇవ్వాలంటే రూ.50వేలు ఇవ్వాలని ఆమెను ఏపీఓ డిమాండ్ చేయడంతో ఆమె ఈ నెల 2వ తేదీన ఆమేరకు నగదు అందజేసింది. నగదు తీసుకున్న ఏపీఓ అదే గ్రామంలోని మరో మహిళను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించినట్టు ఉత్తర్వులు ఇవ్వడంతో ఆమె శుక్రవారం ఎంపీడీఓ శేషుబాబుకు ఫిర్యాదు చేసింది. ఉపాధి హామీ ఏపీఓ కామేశ్వరరావు రూ. 50 వేలతో పాటు మరో రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. నగదు ఎందుకని ప్రశ్నిస్తే ఎంపీడీఓ, ఉపాధిహామీ ఏపీడీ, పీడీలకు వాటాలు ఇవ్వాలని చెప్పారని తెలిపింది. కనీసం ఉపాధి హామీ పథకంలో ఒక్కరోజు కూడా ఉపాధిహామీ పనిచేయని మహిళను ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎలా నియమించారో వివరాలు కావాలని కోరింది.

కూటమి నిర్లక్ష్యం!

- ఆశ్రమ వసతిగృహాల్లో వంట కుక్‌లేరీ!
- ఆరోగ్యాన్ని పరిరక్షించే ఏఎన్‌ఎంలూ లేరు...
- తీవ్రంగా వేధిస్తున్న నాల్గో తరగతి ఉద్యోగుల కొరత
- 47 ఆశ్రమ పాఠశాలల్లో 15 వేల మంది విద్యార్థులకు తప్పని తిప్పలు
- విద్యా సంవత్సరం ముగుస్తున్నా.. ప్రభుత్వానికి పట్టడం లేదు..



గిరిజన విద్యార్థులకు వండి వడ్డిస్తున్న తాత్కాలిక వంట మనిషి

సీతంపేట: కార్పొరేట్ విద్యకు దీటుగా గిరిజన విద్యనందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఆ దిశగా అడుగులు పడలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం మరో మూడు నెలల్లో ముగియనున్నప్పటికీ సమస్యలు యథాతథంగానే ఉన్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వండి వడ్డించడానికి వంటకుక్‌లు కూడా లేరంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించే హెల్త్ వలంటీర్‌లు లేరు. చదువులు మాట అటుంచితే ఆరోగ్యాలు మాత్రం క్షీణించిపోతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలున్నాయి. దాదాపు 15 వేల మంది గిరిజన విద్యార్థులు వీటిల్లో చదువుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్తూ అక్కడే భోజనాలు కూడా చేస్తారు. ఉండడానికి అక్కడే ప్రత్యేక వసతిగృహాలుంటాయి. మెనూ ప్రకారం సక్రమంగా భోజన సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ విద్యార్థులకు వండి వడ్డించే వారు కరువయ్యారు.

వంద మందికిపైనే అవసరం

ఐటీడీఏ పరిధిలో 18 సబ్‌ప్లాన్ మండలాలుండగా ప్రతీ మండలంలో ఒకటో, రెండో ఆశ్రమ వసతిగృహాలున్నాయి. అయితే వీటిలో అధికారిక గణాంకాల ప్రకారం 90 మందికి పైన వంట చేసే వర్కర్లు ఉంటే సరిపోతారని చెబుతున్నప్పటికీ వందమందికి పైగా వంటవారు అవసరం ఉంటుందని అనధికారిక అంచనా. ప్రస్తుతం గిరిజన విద్యార్థుల్లో కూడా విద్యపై ఆసక్తి పెరుగుతుంది. అదే స్థాయిలో ఒక్కో పాఠశాలలో సరాసరి 400ల మంది వరకు విద్యార్థులున్నారు. కొన్ని స్కూల్స్‌లో 600ల వరకు ఉన్నారు. వీరికి మూడు పూటల వండి పెట్టాలంటే కష్టసాధ్యమైన పని. ఉన్న వసతిగృహాల్లో ఒకరిద్దరికి మించి వర్కర్లు లేరు. వండేవారు ఒకరైతే వారికి సహాయకారిగా బియ్యంలో రాళ్లు ఏరడం, కూరగాయలు కోయడంతో పాటు ఇతర పనులు చేయడానికి వ్యక్తులు కూడా అవసరం ఉంది. తగినంతమంది సిబ్బంది లేకపోవడంతో డిప్యూటీ వార్డెన్లు కొంత మంది చేతిచమురు వదిలించుకుని తాత్కాలికంగా వంట వారిని కొన్నిచోట్ల నియమించుకున్నారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించే ఏఎన్‌ఎంలెక్కడ!

విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించే ఏఎన్‌ఎంలను ఆశ్రమ పాఠశాలల్లో నియమించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణికి గిరిజన సంఘాలు ఈ విషయమై వినతులు సమర్పించినా ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదు. ఆశ్రమ పాఠశాలల్లో అయితే బాలికల ఆరోగ్య పరిస్థితి చెప్పుకోలేని స్థితిలో ఉంటాయి. తప్పనిసరిగా ఏఎన్‌ఎంలు ఉండాలి. అత్యవసర సమయాల్లో నానా అవస్థలు పడుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో అయితే పరిస్థితి దారుణంగా ఉంది. రాత్రి వేళల్లో జ్వరాలు, కడుపునొప్పి ఇతర సమస్యలు వస్తే ప్రాథమిక వైద్యం కరువవుతుంది. అప్పటికప్పుడు పీహెచ్‌సీలకు తీసుకువెళ్లలేని పరిస్థితి. ఒక్కో ఆశ్రమ పాఠశాలకు ఒక్కో ఏఎన్‌ఎంను నియమించాల్సి ఉన్నా ఇంతవరకు కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం.

అనుమతి వచ్చింది



వంట కుక్‌లుగా తాత్కాలికంగా పని చేస్తున్న వారు కోర్టుకు వెళ్లడంతో కేసు నడుస్తుంది. దీనిలో 85 మంది సిబ్బందిని నియమించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి కూడా పర్మిషన్ వచ్చింది. వీరిని ఆప్కాస్‌లో చేర్చి త్వరలో తీసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నాం. – సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఐటీడీఏ పీఓ, సీతంపేట

ప్రభుత్వ అలసత్వం



ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి వంట మనుషులను, హెల్త్ వలంటీర్లను నియమిస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మరణాలు కూడా సంభవిస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. – ఎం.తిరుపతిరావు, గిరిజన సంఘం కార్యదర్శివర్గ సభ్యులు

కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు...

- మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ : కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల జోలికి వచ్చి ఊరికే వేధిస్తే సహించేది లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పిట్టాడ గ్రామంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్ల తమ్మిరాజుపేట గ్రామానికి చెందిన కన్నంనాయుడు కుటుంబం అత్త మామల ఆస్తి వివాదానికి సంబంధించి ఆంధ్ర పోలీస్‌స్టేషన్‌లో కన్నంనాయుడుపై కేసు నమోదు కాగా పోలీసులు అతని భార్యను కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలని ఈ విషయమై గజపతినగరం సీఐ జీఏవీ రమణకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ ఇష్టారాజ్యంగా చిరుద్యోగులను వేధిస్తున్నారని ఆరోపించారు. కూటమి నేతలు తమ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కూటమి నేతల బెదిరింపులకు భయపడేది లేదన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు రెడ్డి ఉమామహేశ్వరరావు సోదరుడు వివాహానికి హాజరయ్యారు. సమావేశంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు, నాయకులు లెంక రత్నాకర్, కనిమెరక త్రినాధరావు, గంట్రేటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దిగువశెంబిలో ఐసీడీఎస్ పీడీ పర్యటన

సాక్షి ఎఫెక్ట్



దిగువశెంబిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

సాలూరు: కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలతో ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, ఎస్ఐ నరసింహమూర్తి అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి మండలంలోని ఆంధ్రా – ఒడిశా వివాదాస్పద కొఠియా గ్రూపు గ్రామాల్లో ఒకటైన గంజాయిభద్ర పంచాయతీ దిగువశెంబి గ్రామంలో శుక్రవారం పర్యటించారు. కొఠియా పల్లెల్లో ఒడిశా పోలీసుల జులుం శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. గ్రామంలో ఒడిశా అధికారులు, పోలీసులు ఇటీవల అంగన్‌వాడీ కేంద్రంలో బోర్డును, తెలుగు చార్టులను తీసుకువెళ్లిపోయిన ఘటనపై ఆరా తీశారు. వివరాలను స్థానికుల నుంచి తెలుసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందివ్వనున్నట్టు పీడీ కనకదుర్గ సాక్షికి తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలో రక్తహీనత నివారణ కిట్లను అందజేశారు. వారి వెంట అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

గణిత శాస్త్ర పరిశోధనలు అభివృద్ధికి కీలకం

- సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు
- రెండు రోజుల జాతీయ స్థాయి సైన్స్ అకాడమీ లెక్చరర్ వర్క్‌షాప్ ప్రారంభం



సత్కారం పొందుతున్న సెంచూరియన్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

విజయనగరం అర్బన్: ఇంజనీరింగ్, మెడిసిన్, ఆర్థిక, ద్రవ్య సామాజిక రంగాలలో అభివృద్ధికి గణితశాస్త్ర పరిశోధనలు కీలకంగా నిలుస్తాయని సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. స్థానిక మహారాజా అటానమస్ కళాశాలలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి సైన్స్ అకాడమీ లెక్చరర్ వర్క్ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రంలో పరిశోధనలు జరిపించి అన్వేషించి కొత్త ప్రతిపాదనలు రూపొందిస్తారని అన్నారు. గణితశాస్త్ర అధ్యాపకులు చక్కని విషయ పరిజ్ఞానం, బోధన పటిమను కలిగి ఉంటూ ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకుంటూ చమత్కార భాషణం చేయాలని సూచించారు. గణిత క్లబ్బులను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు గణితం అంటే ఎంతో ఇష్టం కలుగుతుందని చెప్పారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. బెంగళూరుకు చెందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో మాన్సాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, గణిత శాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు, చెన్నై మేథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ సైన్స్ ప్రొఫెసర్ పాంబొలి, మనోజ్, బీవీ రావు, కృష్ణ హనుమంతు, గణిత శాస్త్రం సీనియర్ అధ్యాకులు సీఎస్‌కే ఉమాశంకర్, బి.ఝాన్సీ, ఎం.స్వామినాయుడు, టి.స్వాతి, ఎంవీ లక్ష్మి, డి.రమేష్, డాక్టర్ శ్రీదేవి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన యువకులపై కేసు



పట్టుబడిన గంజాయిని తహసీల్దార్ సమక్షంలో తూకం వేస్తున్న పోలీసులు

కొత్తవలస : గంజాయిని అక్రమంగా రవాణ చేస్తూ పట్టుబడిన తిరుపతి, కడప జిల్లాలకు చెందిన ఇద్దరు యువకులపై కొత్తవలస పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి ఎస్ఐ సుదర్శనరావు తెలిపిన వివరాలు... తిరుపతి జిల్లాకు చెందిన ఎ.ప్రవీణ్‌కుమార్, కడప జిల్లాకు చెందిన కె.మధుసూదన్ ఇద్దరూ స్నేహితులు. వీరు ఒడిశా రాష్ట్రం పాడువ గ్రామం వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తి నుంచి రూ.10వేలు ఇచ్చి నాలుగు కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. సదరు వ్యక్తులు గంజాయిని రెండు కేజీల చొప్పున వారి బ్యాగుల్లో వేసుకొని అక్కడ నుంచి అరకు వచ్చారు. అరకు నుంచి బస్సులో కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్ చేరుకున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దిగి ఎదురుగా ఉన్న హోటల్‌లో భోజనం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో సమాచారం రావడంతో ఎస్ఐ సుదర్శనరావు తన సిబ్బందితో కాంప్లెక్స్ వద్దకు వెళ్లేసరికి సదరు ఇద్దరు పారిపోయేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఇద్దరిని అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా వారి బ్యాగ్‌లలో రెండు కేజీల చొప్పున్న గంజాయి ఉండడాన్ని గుర్తించారు. తహసీల్దార్ నీలకంఠారావు, వీఆర్‌ఓ రాధాకృష్ణల సమక్షంలో గంజాయిని సీజ్ చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కొత్తవలస కోర్టులో హాజరు పరిచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ సుదర్శనరావు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



బాలిగౌరినాయుడు (ఫైల్)

మెరకముడిదాం: మండల కేంద్రమైన మెరకముడిదాం గ్రామానికి చెందిన బాలిగౌరినాయుడు(50) శుక్రవారం ట్రాక్టర్ పైనుంచి జారిపడి మృతి చెందాడు. బంధువులు, పోలీసులు కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. మండల కేంద్రమైన మెరకముడిదాం గ్రామానికి చెందిన బాలిగౌరినాయుడు వ్యవసాయ పనులు చేసుకొని జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌కి గడ్డి ఎక్కించే పని నిమిత్తం వెళ్లాడు. అయితే మెరకముడిదాం, సోమలింగాపురం గ్రామాల మధ్యలో వున్న పంట పొలాల్లో వున్న గడ్డిని ట్రాక్టర్‌కు ఎక్కిస్తున్న సమయంలో ట్రాక్టర్ పైనుంచి కిందకు జారి పడిపోయాడు. దీంతో అక్కడే వున్న తోటి రైతులు వెంటనే అతనికి సపర్యలు చేసి ఆటోలో మెరకముడిదాం గ్రామం తీసుకువెళ్లి అక్కడ ఒక ప్రైవేటు వైద్యుడుకి చూపించగా అప్పటికే గౌరినాయుడు మృతి చెందినట్టు ఆ వైద్యుడు నిర్ధారించాడు. మృతుడుకి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు వున్నారు. గౌరినాయుడు మృతి చెందడంతో ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయామని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న బుధరాయవలస ఎస్ఐ జి.లోకేష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు రైస్ మిల్లు వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లు పట్టుకొని యువకుడు ఆత్యహత్యకు పాల్పడ్డాడు. కోటగండ్రేడు రైస్ మిల్లు వద్ద రెండు నెలలుగా పని చేస్తున్న బిహార్ రాష్ట్రం కగారియా జిల్లాకు చెందిన పులేషణ కుమార్ (27) కుటుంబ సభ్యులతో ఫోన్‌లో గురువారం వాదులాడాడు. దీంతో అసహనానికి గురైన యువకుడు రైస్ మిల్లు బయట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లు శుక్రవారం పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. రైస్ మిల్లులో పని చేస్తున్న వారు గమనించి విద్యుత్ సరఫరా నిలిపివేసి 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ నారాయణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు అస్వస్థత



దుంపలు తిని కురుపాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఉపాధి పనుల్లో భాగంగా చెరువు తవ్వుతుండగా లభించిన దుంపలు కాల్చి తినగా ముగ్గురు ఉపాధి కూలీలు అస్వస్థతకు గురైన సంఘటన కురుపాం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రస్తాకుంటుబాయి గ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలు శుక్రవారం గ్రామ సమీపంలో చెరువును తవ్వుతుండగా.. పులి దుంపలు లభించాయి. వాటిని సేకరించిన ఆరిక మాధవరావు, ఆరిక ప్రవీణ్, చల అనే ముగ్గురు వ్యక్తులు వాటిని కాల్చి తిన్నారు. కొంత సేపటికి వారికి విపరీతంగా వాంతులు రావటం, ఎంతకీ తగ్గకపోవడంతో వెంటనే కురుపాంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. వైద్యులు సేవలు అందించి పర్యవేక్షిస్తున్నారు. వారి పరిస్థితి కుదుటగానే ఉందన్నారు. సమాచారం తెలుసుకున్న కురుపాం పోలీసులు ఆస్పత్రికి వెళ్లి బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

బాల్య వివాహాల ఆలోచన కూడా రాకూడదు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద బాలల సంక్షేమం, పరిరక్షణ కోసం గ్రామ స్థాయిలో సర్పంచ్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి కమిటీలో మహిళా పోలీస్ కన్వీనర్‌గా ఉంటారని, పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఎన్జీఓలు తదితరులు సభ్యులు ఉంటారని తెలిపారు. గ్రామ స్థాయి సమావేశాల్లో అనాథ పిల్లలను, స్కూల్ డ్రాప్ ఔట్స్‌ను గుర్తించాలని చెప్పారు. బాల్య వివాహాలు, ట్రాఫికింగ్, దోపిడీ తదితర అంశాలపై చర్చించాలన్నారు. బాలల హక్కుల సంరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల ఆలోచన రాకుండా చూడాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ రుక్సానా బేగం, డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి, డీఈఓ మాణిక్యం నాయుడు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పొడవునా సహకార ఉత్సవాలు

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా పాటిస్తూ జిల్లాలో ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెల్లడించారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేస్తూ ప్రతి నెలా ఒక్కో అంశంపై కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సహకార అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం తన కార్యాలయంలో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంవత్సరంలో భాగంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా బ్యాంకింగ్ కార్యకలాపాలను పెంచడంతో పాటు పెద్ద ఎత్తున ఖాతాదారులను చేర్పించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు తమ పరిధిలోని వివిధ పథకాల లబ్ధిదారులను డీసీసీబీ ఖాతాదారులుగా చేర్పించేలా ప్రోత్సహించాలన్నారు. జేసీ సేతుమాధవన్, సహకార అధికారి పి.రమేష్, డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, వ్యవసాయ శాఖ జేడీ వీటీ రామారావు, పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వైవీరమణ, పౌర సరఫరాల శాఖ అధికారి మధుసూధనరావు, చేనేత, జౌళి శాఖ ఏడీ మురళీకృష్ణ, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

3న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్


- రాజకీయ పార్టీలు మోడల్ కోడ్‌ను పాటించాలి
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఫిబ్రవరి 3న విశాఖ జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. జనవరి 29న షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ఆయన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలు వివరించారు. ఎన్నికల కోడ్, సాధారణ ఎన్నికలకు ఉన్నట్లే ఉంటుందని పొలిటికల్ ప్రతినిధుల అధికారిక కార్యక్రమాలు ఉండకూడదని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని, పొలిటికల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని తెలిపారు. మోడల్ కోడ్ అమలు కోసం 27 ఎంసీసీ బృందాలు, 27 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పని చేస్తాయని తెలిపారు. జిల్లా పరిషత్ సీఈఓ ఎంసీసీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీ నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు అని, 11న స్క్రూటినీ, 13న ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నిక జరుగుతుందని ఓట్ల లెక్కింపు మార్చి 3న ఉంటుందని, మార్చి 8 లోపల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని స్పష్టం చేశారు.

గురుదేవా ట్రస్టును సందర్శించిన జాతీయ అంధుల క్రికెట్ జట్టు సభ్యులు



గురుదేవా ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయ అంధుల క్రికెట్ జట్టును సన్మానిస్తున్న చైర్మన్ జగదీష్‌బాబు

కొత్తవలస : మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటిబుల్ ట్రస్టును ఇండియా అంధుల క్రికెట్ టీమ్ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఆధ్వర్యంలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇండియా అంధుల క్రికెట్ టీమ్ కెప్టెన్ దుర్గారావు, మాజీ కెప్టెన్ అర్జున అవార్డు గ్రహీత అజయ్‌రెడ్డి మాట్లాడారు. త్వరలో జరగనున్న నాగేష్ ట్రోఫీ పోటీలకు సంబంధించి విశాఖపట్నంలో వామ్‌అప్ ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడేందుకు వచ్చామని తెలిపారు. ఇందుకు సంబంధించి నాలుగు రోజులు విశాఖపట్నంలో ఉండాల్సి వచ్చిందని, ఇందుకుగాను వసతి, భోజనం, రవాణ ఖర్చులను గురుదేవా చారిటిబుల్ ట్రస్టు భరించిందని వారు తెలిపారు. ట్రస్టు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టీమ్ సభ్యులకు ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఘనంగా సన్మానించారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యసంపద వృద్ధికి చర్యలు

విజయనగరం ఫోర్ట్: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద జిల్లాలో మత్స్య సంపద వృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం మత్స్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్య సంపద వృద్ధితో ప్రజలకు పోషకారంతో పాటు ఎన్నో కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. చేపల పెంపకానికి మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, ఇతరులకు 30 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. చివరి ఏడాది జిల్లాలోని 110 చెరువుల్లో చేపపిల్లల పెంపకానికి చర్యలు తీసుకున్నామన్నారు.

సమావేశంలో మత్స్యశాఖ డీడీ ఎస్.నిర్మలాకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు, పశు సంవర్ధక శాఖ జేడీ వై.వి.రమణ, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, డీటీడబ్ల్యూ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.